తేదీ 06.8.2008, పూర్ణచంద్ర ఆడిటోరియం

# 'ఎడ్యుకేర్'తో కూడినప్పుడే 'ఎడ్యుకేషన్'కు సార్థకత

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నెగాంచినయట్టి
ఘన సత్యశీలమె కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావముకన్న మాన్యమెద్ది
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతు లరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఋుగలేదొ
అట్టులైనారు మన భారతీయులు నేడు

సామాన్యుడైనటువంటి మావటివాడు బలమైన ఏనుగును బెదిరించి లొంగదీసుకోగల్గుతున్నాడు. తన కెంత బలమున్నదో తనకు తెలియదు కనుకనే ఏనుగు మావటివానికి లొంగిపోయి అతను కూర్చోమంటే కూర్చోవడం, లేవమంటే లేవడం ఈవిధంగా చేస్తూ ఉంటుంది. అటులనే మానవుడు తాను ఆత్మస్వరూపుడై ఉండికూడను,

srisathyasaivachanamrutam

తానే దైవమై ఉండికూడను తన బలము తాను తెలిసికొనలేక లోకానికి లొంగి, లోక భ్రాంతికి లొంగి అనేకవిధములుగా అవస్థలకు గురి అవుతున్నాడు. ఏ చిన్న బాధ కలిగినా తాను భరించుకో లేకపోతున్నాడు. తనకు ఒకచోటినుండి మరోచోటికి ట్రాన్స్ఫర్ అయినా భయపడిపోతున్నాడు; తన బిడ్డకేమైనా జబ్బు వచ్చినా భయపడిపోతున్నాడు. దీనికంతటికీ కారణం ఈనాటి చదువులే!

ఈ ఆధునిక విద్య కేవలం బాహ్య జగత్తునకు సంబంధించినటువంటిది. దీని సహాయంతో ధనమును సంపాదించి పొట్ట నింపుకోవచ్చు; అస్థిరమైనటువంటి శరీరానికి తగిన అనుకూలములు చేసుకోవచ్చును; కాని, మనస్సుకు శాంతి కలుగదు. ధనమువలన లౌకికమైన సుఖములు పొందవచ్చునుగాని, ఆధ్యాత్మిక ఆనందమును అనుభవింప అలవికాదు. మానవుడు ఆధ్యాత్మికమునందు మాత్రమే సుఖశాంతులను అనుభవించగలడు. "భజన బినా సుఖశాంతి నహీ..." సుఖశాంతులు భగవంతుని భజించడంవల్లనే మనకు లభిస్తాయిగాని, ధనమువలన, ప్రాపంచికమైన 'ఎడ్యుకేషన్'వలన లభించవు. "చదువు చదివి చదివి చావంగనేటికి? చావు లేని చదువు చదువవలయు."

**చదువులన్నియు చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏ నీతి ఉన్నను**
**హీనుడవ గుణంబు మానలేడు**

ఇటువంటి చదువులు ఎంతకాలం చదివినప్పటికీ ఏమి ప్రయోజనం? ఈనాటి మానవుడు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా గుణములను విడిచిపెట్టి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే పశుగుణములను అనుభవిస్తున్నాడు. కనుకనే, ఎవరిని చూసినా, వారికి ఎంత ధనమున్నా సుఖశాంతులు లేవు. మానవుడు సుఖశాంతులను అనుభవించవలెనన్న మొట్టమొదట 'ఎడ్యుకేర్'కు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరమున్నది.

'ఎడ్యుకేర్' అనగా మనలోపల ఉన్నటువంటి సహజమైన భావములను బయటికి తీయడమే! దానివల్ల మనం ఎంతైనా సుఖపడతాము. ఈనాడు ప్రపంచంలో ఎన్నియో

sri sathyasai vahini amrutam

కాలేజీలున్నవి; ఎందరో ప్రొఫెసర్లూ, పిహెచ్.డి. చేసినవాళ్ళూ ఉన్నారు. కాని, వారికేమైనా సుఖశాంతులున్నవా? గొప్పగొప్ప విద్యావంతులున్నప్పటికీ ప్రపంచంలో శాంతి ఉన్నదా? లేదు. కారణం? మీరు చదివే చదువులన్నికూడను కేవలం పొట్టకూటి నిమిత్తమై చదువుతున్నారు. ఈ బాహ్య ప్రపంచానికి సంబంధించిన చదువులతోపాటు 'ఎడ్యుకేర్' అనే అంతర్ సంబంధమైనటువంటి, ఆత్మ సంబంధమైనటువంటి చదువుకూడా చదవాలి. ఆత్మ అనేది సర్వత్రా ఉన్నది; సర్వమానవులయందు ఉన్నది. కనుక, "అహం బ్రహ్మాస్మి" (నేను బ్రహ్మను) అనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి. కేవలం దేహాన్ని దృష్టిలో పెట్టుకొని తాను మానవుడనని భావిస్తున్నాడే గాని, నిజానికి తాను దైవస్వరూపుడే!

**మానవతా గుణములు గలవాడే మానవుడు**

మానవతా గుణములలో మొట్టమొదటిది సత్యము. దానికి ఏదైనా రూపమున్నదా? లేదు. ప్రేమ అనేది ఇతరులపై చూపినప్పుడు మాత్రమే ఉన్నట్లుగా కనిపిస్తుందికాని, దానికికూడను రూపము లేదు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు రూపరహితమైనవి. అవి మన హృదయమునందే ఉన్నవిగాని, కనిపించవు. ఎప్పుడు ప్రేమ ఆవిర్భవిస్తుందో అప్పుడు ద్వేషమనేదే కనిపించదు, హింస అనేదే ఉండదు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మానవతా గుణములు, మానవతా లక్షణములు. మానవునియొక్క విలువలు ఇవే! కాని, ఈనాడు మానవతా విలువలంటే ఏమిటో తెలుసుకోవడం లేదు. దండిగా డబ్బు సంపాదించుకొని బ్యాంకులో పెట్టుకోవడం, ఆస్తిపాస్తులు ప్రోగు చేసుకోవడం – ఇదే గొప్ప 'హ్యూమన్ వేల్యూ' (మానవతా విలువ) అని మీరు భావిస్తున్నారు. ఇదే విద్యయొక్క పరమార్థమని అనుకుంటున్నారు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను వదలిపెట్టి మిగిలినవన్నీ తీసుకుంటున్నారు. కామము, క్రోధము, లోభము, మోహము ఇవన్నీ మృగ లక్షణాలు. ఇవి మీలో తలెత్తినప్పుడు "నేను మృగమును కాను, నేను మానవుడను, మానవుడను, మానవుడను" అని మీకు మీరు చెప్పుకోవాలి. "నేను మానవుడన"ని చెప్పుకుంటే సరిపోదు; నీలో మానవతా గుణములు ఉంటేనే నీవు మానవుడవు. నీవు ఎన్నో గ్రంథములు చదివి గొప్ప పండితుడనీ, గొప్ప విద్యావంతుడనీ పేరు తెచ్చుకోవచ్చుగాని,

sri sathyasai vachanamrutam

నీలో మానవతా గుణములే లేకపోతే నీవు మానవుడవే కాదు.

**చిట్టచివరికి వట్టి చేతులతోనే పోవలసివస్తుంది**

మానవునికి ఆనందమిచ్చేటటువంటివి తనయొక్క అంతర్భావములేగాని, బాహ్యమైన సిరిసంపదలూ, పదవులూ కావు. ఎంతటి గొప్ప చక్రవర్తి అయినప్పటికీ తాను పోయే సమయంలో పిడికెడు మట్టినికూడా తీసుకుపోలేడు. ఎటువంటి కోటీశ్వరుడైనప్పటికీ చివరికి వట్టిచేతులతోనే పోవలసివస్తుంది. సంపాదించినటువంటి డబ్బును బ్యాంకులలో దాచిపెట్టవచ్చునుగాని, తుదకు అది 'దొంగల కిత్తురో, దొరలకగునో!' మీకు తెలుసు – అలెగ్జాండర్ ప్రపంచమునంతా జయించాలని బయల్దేరాడు. సింధూనది దాటి ఇండియాకు కూడా వచ్చాడు. కాని, తిరిగి వెళ్ళే సమయంలో మధ్యలోనే అతనికి 'హార్ట్ ఎటాక్' వచ్చింది. అతనివెంట అనేకమంది వైద్యులున్నారు; వేలాది సైనికులున్నారు. వైద్యులు అతనిని పరీక్షించి, "సార్, మీరు ఇక ఎక్కువ కాలం ఉండరు; కొద్ది నిమిషాల్లోనే ప్రాణం విడుస్తారు" అని చెప్పారు. "అయితే, మీరొక పని చేయండి. నేను ప్రాణం విడిచిన తరువాత, ఈ దేహానికి బట్ట చుట్టి, రెండు చేతులూ పైకి ఎత్తిపెట్టి మన పురవీధులలో ఊరేగించండి. 'ఏమిటిది, అలెగ్జాండర్ చక్రవర్తిగారి చేతులు పైకి ఎత్తిపెట్టారెందుకు?' అని ప్రజలు మిమ్మల్ని అడుగుతారు. 'అలెగ్జాండర్ ఇంత రాజ్యమును సంపాదించినప్పటికీ అంతా వదలిపెట్టి వట్టి చేతులతో వెళ్ళాడు. ఆయన వెంట గొప్ప సైన్యమున్నప్పటికీ, అనేకమంది వైద్యులు ఉన్నప్పటికీ ఎవ్వరూ ఆయనను రక్షించలేకపోయారు,' అనే సత్యాన్ని ప్రపంచానికి చాటండి" అని అన్నాడు.

మనం ఈనాడు చదివే చదువులన్నీ లౌకికమైన చదువులే. అయితే, ఇవికూడను అవసరమే. కాని, ముఖ్యమైనటువంటిది అంతర్భావమే! పుస్తకాలు చదువవచ్చును; చదివినది పదిమందికి చెప్పవచ్చును; డబ్బు సంపాదించ వచ్చును. అంతేగాని, ఈ చదువులు మన జీవితానికి ఆదర్శము నందించలేవు. మనము ఎట్టి చదువు చదవాలి? మనయందున్నటువంటి మానవతా గుణములను ఆవిర్భవింపజేసే చదువు చదవాలి. దానినే 'ఎద్యుకేర్' అన్నారు. దీని నిమిత్తం ఏ 'టెక్స్ట్ బుక్స్'కూడను చదువనక్కర్లేదు.

sri sathyasai vachanamrutam

అయితే, మనం దేహమును ధరించాము కాబట్టి, దేహమును పోషించుకొనే నిమిత్తమై ఈ చదువులు చదవాలిగాని, లేకపోతే ఇవి మనకు అక్కర్లేదు. ఈ బహిర్ విద్యలతోపాటు అంతర్ విద్యనుకూడా నేర్పే నిమిత్తమై మీ అందరినీ మేము ఇక్కడ చేర్చుకున్నాము. ఈ చదువులను మీరు ఉత్తమమైనటువంటి విద్యావంతుల నుండి నేర్చుకోవడం చాలా అవసరం.

**తండ్రికి తగినటువంటి తనయుడు అనిల్ గోకాక్**

ఈ యూనివర్సిటీ మొట్టమొదటి వైస్ ఛాన్స్‌లర్ వి.కె. గోకాక్. ఆయన మన కాలేజీలు రాకపూర్వమే నాకు బాగా తెలుసు. ఆయన నా దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. ఎప్పుడు చూసినా స్వామియొక్క నామాన్ని స్మరిస్తూ ఉండేవాడు. ఆయన, ఆయన భార్య ఇరువురూ ఏక మనస్సుతో స్వామిని నమ్మినటువంటివారు. నేను వారింటికి వెళ్ళినప్పుడు మొట్టమొదట నన్ను పూజారూమ్‌కి తీసికొని పోయేవారు. గోకాక్ చాలా ఉత్తముడు. అతని హృదయం చాలా పవిత్రమైనటువంటిది. ఆయన చేసిన కృషివల్లనే ఈనాటి పిల్లలందరు ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. నేను చెప్పినవన్నీ ఆయన తు.చ. తప్పకుండా పాటించేవాడు. పిల్లలకు చాలా మంచి విషయాలను బోధించేటటువంటివాడు. తనకు ఏ చిన్న సందేహం కలిగినా నా దగ్గరికి వచ్చి విచారించుకొని పోయి దానిని పిల్లలకు వివరించేవాడు.

తండ్రికి తగినటువంటి తనయుడు అనిల్ గోకాక్. అతను మన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా మూడు సంవత్సరాలు పూర్తిచేసి ఈనాడు పదవీ విరమణ చేస్తున్నాడు. ప్రాపంచికంగా అతను దీనిని వదలుతున్నాడేగాని, మానసికంగా ఎప్పుడూ ఇక్కడే ఉన్నాడు. భార్యాభర్తలిద్దరూ పరమ భక్తులు. వారిరువురినీ ఈనాడు మనం దూరం చేసుకుంటున్నామని అనుకోకండి. మనం వారిని దూరం చేసుకోవడం లేదు; వారుకూడా దూరం పోవడం లేదు. వారు ఎప్పుడుకూడను ఇక్కడే ఉన్నారు. వారి హృదయంలో మన యూనివర్సిటీ చిరస్థాయిగా నిలిచిపోయింది. వారు ఎక్కడికి వెళ్ళినప్పటికీ వారియొక్క భావములు స్వామివెంటనే ఉంటాయి. స్వామికూడను వారి వెంటనే ఉన్నాడు. కనుక, ఈనాడు అనిల్

sri sathyasai vachanamrutam

గోకాక్‌కి మనం 'సెన్డాఫ్' (వీడ్కోలు) ఇస్తున్నామని భావించకండి. ఇక్కడ 'సెన్డాఫ్' అనేది లేదు; ఎప్పుడుకూడను స్వాగతమే, స్వాగతమే, స్వాగతమే! "మీరు ఎక్కడికి వెళ్లినప్పటికి ఇక్కడికి వస్తూ ఉండండి" అని వారితో నేను చెప్పాను. వారి కుటుంబము మొదటినుంచికూడను ఇప్పటివరకు స్వామియందు నిశ్చలమైన భక్తిభావముతో ఉన్నటువంటిది. వారి హృదయమునందు స్వామి ప్రతిష్ఠితుడై ఉన్నాడు. ప్రాపంచికంగా కొంత దూరంగా ఉండినట్లు కనిపించినా, మానసికంగా ఒక్కటిగానే ఉన్నాము. అతను నావాడు. నేను అతనివాణ్ని. "యు అండ్ ఐ ఆర్ వన్" (నీవు, నేను ఒక్కటే) అని చెప్పాను. అతనే కాదు, మీరందరుకూడను ప్రత్యేకంగా ఉన్నటువంటివారు కాదు. మీరు వ్యక్తులుగా వేర్వేరు రూప నామములతో బయట ఉండినప్పటికీ సమష్టిగా నాలోనే ఉన్నారు. 'ఈశ్వరస్సర్వ భూతానాం', 'ఈశావాస్యమిదం జగత్.' చీమలుకూడా భగవత్ స్వరూపములే! భగవంతుడు కానటువంటిది ఎక్కడా లేదు.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యమందణగె సర్వ సృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్వమిదియె చూడరయ్య**

అంతా భగవంతుడే! ఎవరో మనలను శిక్షిస్తున్నారని అనుకోకూడదు. శిక్షించే వాడు, రక్షించేవాడుకూడా భగవంతుడే! 'ఆదాయం వచ్చినా, నష్టం వచ్చినా, మంచి జరిగినా, చెడు జరిగినా అంతా భగవంతునియొక్క సంకల్పమే' అనే భావాన్ని మీరెల్లప్పుడు స్థిరంగా పెట్టుకోవాలి. ఎవరు ఏది చేసినా, చిన్నపనిగాని, పెద్దపనిగాని అంతా భగవంతునియొక్క సంకల్పమే! ఎవరో మిమ్మల్ని బాధపెట్టినారని వారిని మీరు ద్వేషించకూడదు. "వారుకూడా నావారే, నావారే, నావారే" అనేటటువంటి ప్రేమభావాన్ని మీరు దృఢంగా పెట్టుకోవాలి.

**నీవే భగవంతుడవు!**

అందరూ ఒకటే. All are one, be alike to everyone. దేహములు వేర్వేరుగా

sri sathyasaivachanamrutam

ఉండవచ్చు; భావములు వేర్వేరుగా ఉండవచ్చు. కాని, ఆత్మతత్త్వము ఒక్కటే. అమెరికాకు పోయినా, ఇండియాలో ఉన్నా, జపానుకు పోయినా, జర్మనీకి పోయినా, పాకిస్థాన్‌కు పోయినా అన్నిచోట్ల కనిపించేది ఒకే సూర్యుడు కదా! ఇప్పుడు మనకు పగలయితే అమెరికాలో చీకటిగా ఉంటుంది. అయితే, అక్కడ సూర్యుడు లేడా? ఇక్కడ మాత్రమే ఉన్నాడా? కాదు, కాదు. అక్కడా ఉన్నాడు, ఇక్కడా ఉన్నాడు. భూమి తిరగడంచేత ఒకచోట కనిపించి, మరొకచోట కనిపించడం లేదు. ఎక్కడ చూసినా ఉన్నది ఒకే సూర్యుడు, ఒకే భగవంతుడు. కనుక, భగవంతుడు ఎక్కడో ఉన్నాడని మనం వెదకనక్కర్లేదు; మనయందే ఉన్నాడు. "భగవంతుడు నా వెంటనే, నా జంటనే, నా ఇంటనే, నా కంటనే ఉన్నాడు" అని విశ్వసించాలి. ఆవిధమైన విశ్వాసము కలిగినటువంటివారికి భగవంతుడు ఎక్కడ కావాలంటే అక్కడ కనిపిస్తాడు. మీరు ఏ కృష్ణనామమో, రామనామమో తలుచుకునేటప్పుడు, ఆ రూపాన్ని మనస్సులో పెట్టుకుంటే తప్పక భగవంతుడు ఆ రూపముతో మీకు దర్శనమిస్తాడు. కనుక, దైవానికి దూరమైనామని మీరు విచారించకండి. దైవమే మీకు దూరమైపోతే మీరెట్లా ఉండగలరు! కాబట్టి, దైవమూ మీరూ ఏకంగానే ఉన్నారు. దీనిని పురస్కరించుకొనియే ఈశ్వరుణ్ని "అర్ధనారీశ్వరుడ"న్నారు. అనగా ప్రకృతి, పురుషులయొక్క ఏకత్వమే! ఈ ప్రకృతిని మనం కేవలం ప్రకృతి భావముతో చూడటంచేతనే ఇన్ని అవస్థలకు గురి అయిపోతున్నాము. కనుక, ఈ ప్రకృతి భావమును వదలిపెట్టి, "ప్రకృతికూడా పరమాత్మ స్వరూపమే! ప్రకృతిలో కూడా నేనే ఉన్నాను" అనే ఏకత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి. భగవంతుడు వేరు, భక్తులు వేరు అనేటటువంటి ద్వైతభావమే మీలో ఉండకూడదు. "ఆయన భగవంతుడు, నేను దాసుణ్ని" అని అనుకోవద్దు. నీవు దాసుడవు కాదు, భగవంతుడు నీకంటె ప్రత్యేకంగా లేడు. నీవే భగవంతుడవు. కనుక, నీవు ఎల్లప్పుడుకూడను 'నేను దైవాన్ని, నేను దైవాన్ని, నేను దైవాన్ని' అని విశ్వసించాలి. కేవలం గుర్తుకోసమని మీరు కొన్ని పేర్లు పెట్టుకుంటున్నారు. ఈ పేర్లు శాశ్వతమైనవి కావు. ఈ రూపనామములు ఏనాటికైనా వదలిపెట్టేవే! ఏనాటికీ వదలనిది ఆత్మ ఒక్కటే! దానిని మీరు ఏకత్వంగా భావించాలి.

'ఇది నా దేహము' అంటున్నావు. మరి నీవెవరు? నీవు ప్రత్యేకంగా ఉంటేనే కదా 'నా



sri sathyasai vahamrutam

దేహము' అని అనగల్గుతున్నావు. కాబట్టి, దేహము నీవు కాదు. మనస్సు నీవు కాదు. ఇంద్రియాలు నీవు కాదు. ఇవన్నీ కేవలం పనిముట్లు మాత్రమే. భగవంతుడు ఈ సృష్టినంతా పాలిస్తున్నాడు. అన్నిటియందు తాను ఏకంగా ఉన్నాడు. వెయ్యి కుండలు పెట్టి నీరు పోస్తే, వెయ్యి కుండలలోనూ సూర్యుడు కనపడతాడు. కాని, వెయ్యి సూర్యులు లేరక్కడ. నీరు పారబోస్తే ఒక్క కుండలో కూడా సూర్యుడు కనిపించడు. అదేవిధంగా, I and mine (నేను, నాది) అనే సంకుచిత భావాన్ని మనం 'పారబోసుకుంటే', ఉండేది దేవుడే! God is one, goal is one (దేవుడు ఒకడే! గమ్యం ఒకటే!)

ఈనాడు అనిల్ గోకాక్ పదవీ విరమణ చేస్తున్నాడు. క్రొత్త వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి విశ్వనాథ పండిట్ 'రెడీ'గా ఉన్నాడు. ఇతనుకూడా చాలా మంచివాడు, విద్యావేత్తగా ఎన్నో దేశములలో పర్యటించాడు. భౌతికంగా వైస్ ఛాన్స్‌లర్లు ఎందరో వచ్చారు, పోయారు. అయితే, వారి ఆత్మలు ఎల్లప్పుడు నావిగానే ఉన్నాయి. నేనే వారి ఆత్మగా ఉన్నాను. కనుక, ఒకరు వచ్చారని, ఒకరు పోయారని మనం భావించరాదు. నీకిచ్చిన డ్యూటీ (కర్తవ్యం) నీవు నిర్వర్తించు. "డ్యూటీ, డ్యూటీ, డ్యూటీ!" అదే భగవంతునితో మీ సంబంధాన్ని బలపరుస్తుంది. "డ్యూటీ ఈజ్ గాడ్." కనుక, మీరు మీ కర్తవ్యాన్నే దైవంగా భావించి సక్రమంగా చేసుకోండి. అనిల్ గోకాక్ తన డ్యూటీ ఎంతో చక్కగా చేశాడు. ఏ చిన్న సందేహం కలిగినా తక్షణమే నాదగ్గరికి వచ్చి చెప్పుకునేవాడు. ఇలాంటివాళ్ళు నాకెంతో అవసరం. వి.కె. గోకాక్‌నుంచి ఈ అనిల్ గోకాక్ వరకు వచ్చిన వైస్ ఛాన్స్‌లర్లందరుకూడను నావాళ్ళే! రాబోయే వాళ్ళుకూడను నావాళ్ళే! ఇటువంటి ఉత్తమమైన విద్యావంతుల సేవలను నేను పిల్లలయొక్క అభివృద్ధికోసమనే ఉపయోగిస్తున్నాను.

మా స్టూడెంట్స్ చాలా మంచిపిల్లలు. వాళ్ళని బయటివారితో పోల్చడానికి వీలుకాదు. బయటి కాలేజీలలో చాలామంది పిల్లలు క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తుంటారు. మా పిల్లలు అటువంటివారితో కలిసేటటువంటివారు కాదు. ఎక్కడికి వెళ్ళినప్పటికీ వాళ్ళు తమ ప్రత్యేకతను నిల్పుకుంటారు. ఎవ్వరినీ ద్వేషించరు; ఎవ్వరినీ కోపంగా చూడరు. 'అందరూ మనవారే' అనే ప్రేమతత్త్వంతో, స్వామి ఆదేశాలను శిరసావహిస్తూ క్రమశిక్షణతో ప్రవర్తిస్తారు. ఆధ్యాత్మికత అనేది అన్నింటికీ శిరస్సువంటిది. శిరస్సును ఆధారం

sri sathyasaivachanamrutam

చేసికొనియే మిగిలిన అంగములన్నీ పనిచేస్తుంటాయి కదా! కనుక, విద్యార్థులు ఆధ్యాత్మికతను తమ శిరస్సుగా భావించాలి. క్లాసు రూమ్‌లో లెక్చరర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని వాటిని మీ మనసులో ప్రింటు చేసుకోవాలి. అంతేగాని, ఈ లెక్చరర్‌కంటె ఆ లెక్చరర్ గొప్ప అనే భేదములు మీరు పెట్టుకోవద్దు. భేదములను విడనాడి మీరంతా మంచిగా ఉంటే, దేశమునంతా మీరే పాలించగలరు. కనుక, మీరు సమచిత్తులై వచ్చిన పెద్దలను ప్రేమతో స్వాగతించి, వారి బోధనలను శ్రద్ధగా విని వాటిని మనస్సులో నిల్పుకోండి! ఇదే ఈనాడు నేను మీకు ప్రధానంగా బోధించేటటువంటి విషయం.

మనస్సులో మీరు ఏమి తలుస్తారో అది మాటలో చెప్పాలి. ఏది చెప్పినారో అది చేయాలి. మీలో త్రికరణ శుద్ధి ఉన్నప్పుడే మీరు త్రిమూర్త్యాత్మక స్వరూపాన్ని పొందగలరు. తలచడం, చెప్పటం, చేయటం – అనే త్రిపుటియొక్క ఏకత్వమే నిజమైన మానవత్వం. 'యూనిటీ' (ఏకత్వం) అంటే జనులు ఊరకే ఒక గుంపుగా చేరిపోవడం కాదు. హృదయము, మాట, క్రియ – ఈ మూడింటియొక్క ఏకత్వం కావాలి. ఇదే నిజమైనటువంటి 'ఎడ్యుకేర్'. దీనికి సంబంధించిన 'టెక్స్‌ట్ బుక్స్'కోసం మనం ఎక్కడా వెదకనక్కర్లేదు. మన హృదయమే దీనికి 'టెక్స్‌ట్ బుక్'. దీనిని మీరు అనుసరిస్తూ రండి. అప్పుడే మీరందరూ 'గుడ్ బాయ్స్' (Good boys) అవుతారు; 'గుడ్ పీపుల్' (Good people) అవుతారు. ఆ 'గుడ్ పీపులే' 'గాడ్ పీపుల్'! కేవలం భౌతిక దృష్టిలో మీరు విద్యార్థులుకాని, ఆత్మస్థాయిలో మీరు దైవమే, దైవమే!

ఈనాడు అనిల్ గోకాక్ పదవీ విరమణ చేసి వెళుతున్నాడు. అయితే, అతను తిరిగి వస్తాడు. ఈ దంపతులు ఎక్కడ ఉండినా నావారే, నేను వారివాడినే! ఇదే వారిరువురికీ స్వామితో గల సన్నిహిత సంబంధ బాంధవ్యము. మీరందరుకూడను మంచిగా ఉంటూ క్రొత్త వైస్ ఛాన్స్‌లర్ అయినటువంటి విశ్వనాథ్ పండిట్‌ను సంతోషంగా స్వాగతించండి, గౌరవించండి.

– తేదీ 06.8.2008, పూర్ణచంద్ర ఆడిటోరియం

sri sathyasai vahini amrutam